క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



సతివాడ అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

నెల్లిమర్ల రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని సమగ్ర శిక్ష జిల్లా అధికారులు ప్రసాద్, ఆదినారాయణ అన్నారు. మండలంలోని సతివాడ గ్రామంలో బడికి పోదాం కార్యక్రమంలో భాగంగా సోమవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన అందుతుందని, ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి బడిఈడు పిల్లలను గుర్తించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కో ఆర్డినేటర్ భారతి, ఎంఈఓ విజయ్ కుమార్, హెచ్‌ఎంలు బంగారు నాయుడు, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

మంత్రులకు ఘనంగా స్వాగతం



కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడుకు స్వాగతం పలుకుతున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

భోగాపురం: కేంద్ర పౌర విమానయాన శాఖ, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రులుగా కింజరాపు రామ్మోహన్‌నాయుడు, కింజరాపు అచ్చెన్నాయుడు ప్రమాణం స్వీకారం చేసి సోమవారం మొదటిసారిగా జిల్లాకు విచ్చేసిన సందర్భంగా మండలంలోని పోలిపల్లి వద్ద నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు గజమాల, దుశ్శాలువతో సత్కరించి స్వాగతం పలికారు. అనంతరం నియోజకవర్గంలోని సమస్యలపై నాయకులతో చర్చించారు. మండలంలో జరుగుతున్న విమానాశ్రయ నిర్మాణ పనులపై ఆరా తీశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సువ్వాడ రవిశేఖర్, కర్రోతు సత్యనారాయణ, కడగల ఆనంద్, పతివాడ అప్పలనాయుడు, గేదెల రాజారావు, నీలాపు అప్పలరామిరెడ్డి, పిడుగు తోటరావు, పసుపులేటి లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

అనాథాశ్రమాల్లో వేడుకల నిర్వహణ మంచిది



వృద్ధులకు అన్నదానం చేస్తున్న అన్నదాత సుఖీభవ ఆశ్రమ నిర్వాహకురాలు కాంచన

విజయనగరం టౌన్: ప్రముఖుల పుట్టిన రోజు వేడుకలు అనాథాశ్రమాల్లో నిర్వహించడం సత్ సంప్రదాయమని పట్టణంలోని కణపాకకు చెందిన అన్నదాత సుఖీభవ అనాథాశ్రమం నిర్వాహకురాలు కాంచన పేర్కొన్నారు. రాజమండ్రి వేమగిరికి చెందిన కొప్పుశెట్టి నాగేశ్వరరావు సూచన మేరకు సంస్థ ఆధ్వర్యంలో సోమవారం రెడ్‌క్రాస్ నిరాశ్రయులకు షెల్టర్ కల్పనతో పాటు కణపాక మర్రిచెన్నారెడ్డి కాలనీలోని అన్నదాత సుఖీభవ ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆశ్రమంలోని పిల్లల మధ్య కేక్ కట్ చేసి వేడుకలను చేశారు. కాంచన మాట్లాడుతూ అనాథ పిల్లల మధ్య ప్రముఖుల పుట్టిన రోజు వేడుకలు నిర్వహించుకుని అన్నదానం చేయడం వల్ల సమాజానికి మంచి సందేశాన్నిచ్చినట్టు అవుతుందన్నారు.

రొంగలి పోతన్న రాజీనామా



విజయనగరం అర్బన్: వైఎస్సార్‌సీపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు రాజీనామా లేఖను పార్టీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావుకు పంపినట్టు రొంగలి పోతన్న సోమవారం తెలిపారు. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఆయన 2014కు ముందు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా సేవలు అందించారు.

ముగ్గురికి కత్తిపోట్లు

విజయనగరం క్రైమ్: మద్యం దుకాణం వద్ద మందుబాబుల రగడతో ముగ్గురు కత్తిపోట్లకు గురయ్యారు. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. ఫూల్‌బాగ్‌కు చెందిన సతీష్, పృథ్వీ, హరీష్‌లు మద్యం కొనుగోలు చేయడానికి దుకాణం వద్దకు వచ్చారు. ఆ సమయంలో అదే ప్రాంతానికి చెందిన అసీద్దీన్, నారాయణలు కూడా వచ్చారు. మద్యం కొనుగోలు చేసేందుకు క్యూలో నిలబడిన సతీష్, అసీద్దీన్ మధ్య ఘర్షణ జరిగింది. దీంతో ఆగ్రహానికి గురైన అసీద్దీన్ తన దగ్గర ఉన్న కత్తితో సతీష్ పొట్టపై రెండు పోట్లు పొడిచాడు. పట్టుకోవడానికి వెళ్లిన హరీష్, పృథ్వీలపై కూడా కత్తితో దాడి చేసి పరారయ్యాడు. స్థానికులు స్పందించి గాయాలైన ముగ్గురిని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. ఈ మేరకు టుటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం మధ్యాహ్నం అయ్యప్పనగర్ వద్ద అసీద్దీన్‌తో పాటు సహకరించిన నారాయణను అదుపులోకి తీసుకున్నారు.

బడి సంచి.. మోయలేనంత!

- అమలుకాని ఎన్‌సీఆర్‌ఈటీ సూచనలు
- విద్యార్థులకు తప్పని పుస్తకాల భారం



మోయలేని పుస్తకాల బ్యాగుతో చిన్నారులు

విజయనగరం: పుస్తకాల సంచి బాలలకు శాపంగా మారుతోంది. మోయలేని భారంతో చిన్నారులు అనారోగ్యానికి గురవుతున్నారన్నది వైద్యుల మాట. ఈ పరిస్థితిని నివారించాలని ఎన్‌సీఆర్‌టీ చేసిన సూచనలు ఎక్కడా అమలుకావడం లేదు. ఏటా పుస్తకాల సంచి బరువు పెరగడమే తప్ప తగ్గం కనిపించడం లేదు. విద్యార్థి తన శరీర బరువులో రెండో వంతు మోయడం అనారోగ్య సమస్యలను తెచ్చి పెడుతోంది. ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచి విద్యార్థుల్లో పుస్తకాల సంచి పరిమాణాన్ని తగ్గిస్తూ రాష్ట్రాలకు కేంద్రం సూచనలు చేసింది. నెలలో మొదటి, మూడో శనివారం నో బ్యాగ్ డేగా నిర్వహించాలన్న ఆదేశాలున్నా ఆచరణలో కనిపించడం లేదు.

ఇదీ ఎన్‌సీఆర్‌ఈటీ పరిశీలన

సంచి బరువుపై జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలి (ఎన్‌సీఆర్‌ఈటీ) నిర్వహించిన సర్వేలో నాలుగు, ఐదు తరగతుల విద్యార్థులను పరిశీలించారు. సాధారణంగా వీరి శరీర బరువు 18 కేజీల నుంచి 22 కేజీల వరకు ఉంటుంది. ప్రభుత్వ బడుల్లో 10 నుంచి 12 కేజీలు, ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 14 నుంచి 18 కేజీలు పుస్తకాల మోత ఉంటుంది. 8 నుంచి పదో తరగతి విద్యార్థుల శరీర బరువు 40 నుంచి 50 కేజీల వరకు ఉంటే వారు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా భావించాలి. వారు బడికి వెళ్లేందుకు 20 నుంచి 25 కేజీల సంచిని మోయాల్సి వస్తోంది. పాఠ్యపుస్తకాలకు తోడు క్యారేజీ, తాగునీటి సీసా తదితరాలు అదనం. ప్రభుత్వ బడుల కన్నా ప్రైవేట్లో మోత ఎక్కువగా ఉంటుందని శిక్షణ మండలి పేర్కొంది. రాష్ట్ర సిలబస్ తోపాటు పాఠశాలలు ప్రత్యేకంగా రూపొందించిన సిలబస్, ఐఐటీ, సీబీఎస్‌ఈ ఇలా వివిధ రకాల పుస్తకాలను మోయాల్సి రావడం విద్యార్థులకు తీవ్ర ఇబ్బందిగా మారుతోంది.

తగ్గని బరువు...

వాస్తవానికి ఒకటి, రెండు తరగతులకు రెండు పుస్తకాలు (లాంగ్వేజెస్, గణితం, ఎన్విరాన్మెంట్) ఉండాలి. సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌ఈ) సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తోంది. ఒకటి, రెండు తరగతులకు ఎనిమిది పుస్తకాలు, తరగతి పెరిగే కొద్దీ అధిక పాఠ్యపుస్తకాలను మోయాల్సి వస్తోంది. దీంతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు భారం తప్పకపోగా... ఇక ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల విద్యార్థుల పరిస్థితి చెప్పనక్కర్లేదు.

ఆరోగ్య సమస్యలివే...

విద్యార్థులు తమ స్థాయికి మించి బరువు మోస్తుండడంతో పలురకాల ఆరోగ్య సమస్యల బారిన పడే అవకాశం ఉందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. వెన్ను, కండరాల నొప్పులకు దారి తీస్తుందని పేర్కొంటున్నారు. శారీరక, మానసిక సమస్యలు ఏర్పడవచ్చంటున్నారు. చదువుపై ఏకాగ్రత తగ్గుతుందని హెచ్చరిస్తున్నారు. సృజనాత్మకత దెబ్బతినడమే కాకుండా తద్వారా విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతారని పేర్కొంటున్నారు.

అవసరమైన మేరకు తీసుకెళ్లాలి

ఒత్తిడి లేని బోధన విద్యార్థులకు అవసరమని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు గుర్తించాలి. విద్యార్థులు మోయలేని స్థాయిలో పుస్తకాల బ్యాగు ఉండకూడదు. అవసరమైన వాటిని తీసుకెళ్లడం చేయాలి. తద్వారా విద్యార్థుల మానసిక, శారీరక శ్రమ తగ్గుతుంది. చదువులో చురుగ్గా ఉంటారు. పరిమితికి మించి బరువు మోయడంతో ప్రశాంతత కోల్పోయి చేసే పనిపై దృష్టి సారించలేరు.

– ఎం. శ్రీనివాసరావు,
చిన్న పిల్లల వైద్య నిపుణుడు

మంత్రికి సత్కారం



మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

భోగాపురం: మంత్రిగా ప్రమాణం చేసి తొలిసారి జిల్లాకు సోమవారం విచ్చేసిన చిన్నతరహా పరిశ్రమలు, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి తన నివాసంలో పుష్పగుచ్ఛాలు అందజేసి, దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు, నాయకులు కంది చంద్రశేఖర్, లోకం ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

రాజాం సిటీ: స్థానిక బొబ్బిలి రోడ్డులో ఈ నెల 16వ తేదీ రాత్రి ఎదురెదురుగా వచ్చిన రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో మెంటిపేటకు చెందిన బండి అన్నారావు, వస్త్రపురికాలనీకి చెందిన కాకర్ల కాళిదాస్‌లకు గాయాలయ్యాయి. స్థానికుల సహాయంతో రాజాం ప్రాంతీయ ఆస్పత్రికి క్షతగాత్రులను తరలించి చికిత్స అందించారు. ఈ ఘటనకు సంబంధించి, మెంటిపేటకు చెందిన బండి అన్నారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ ఎస్.భాస్కరరావు తెలిపారు.

రాజకీయ కక్ష సాధింపు తగదు



ఇంటి నిర్మాణం అడ్డుకుంటున్న వీఆర్వో, పోలీసులు

నెల్లిమర్ల: రాజకీయ కక్ష సాధింపులతో ఇంటి నిర్మాణం అడ్డుకోవడం సమంజసం కాదని బాధితుడు పట్నాన రమణ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక విలేకరులతో ఆయన సోమవారం మాట్లాడారు. నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధి సర్వే నంబర్ 311లో 7వ వార్డు కౌన్సిలర్ మైపాడ ప్రసాద్ వద్ద రెండు సెంట్లు ఇంటి స్థలాన్ని గతంలో కొనుగోలు చేశానని, అందులో ప్రస్తుతం ఇంటి నిర్మాణం చేపట్టానన్నారు. కౌన్సిలర్ మీద రాజకీయ కక్షతో తను నిర్మిస్తున్న ఇల్లు 5 అడుగులు రోడ్డుమీద ఉందన్న తప్పుడు ఫిర్యాదుతో పోలీసులు, వీఆర్వో వచ్చి నిర్మాణ పనులు అడ్డుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా రాజకీయ కక్షతో పనుల అడ్డుకోవడం భావ్యం కాదన్నారు. ఇదే సర్వే నంబర్ రాస్తాలో ఎంతోమంది ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా ఇళ్లు నించుకున్నారని, వాటి మీద చర్యలు తీసుకోకుండా నాలాంటి పేదవారిపై చర్యలు తీసుకోవడం భావ్యం కాదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని రమణ కోరారు.

భారీ వర్షం



రామభద్రపురం జాతీయ రహదారిపై నిలిచిన వర్షపునీరు



రేగిడిలో కురుస్తున్న వర్షం

రామభద్రపురం: మండల కేంద్రంలో సోమవారం భారీ వర్షం కురిసింది. ఉదయం 6 గంటల నుంచి 7.30 గంటల వరకు ఏకధాటిగా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు, ప్రధాన వీధులు, రోడ్లు జలమయమయ్యాయి. దీంతో ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. అయితే ప్రస్తుతం కురిసిన వర్షం పత్తి, మొక్కజొన్న విత్తనాలు విత్తుకునేందుకు, ఇప్పటికే పంట దశలో ఉన్న కూరగాయల పంటకు అనుకూలమని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రేగిడి: మండలంలో సోమవారం ఉదయం భారీ వర్షం కురిసింది. ఉన్నట్టుండి వాతావరణం మారిపోయి ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన వర్షం పడింది. ప్రస్తుతం సాగులో ఉన్న చెరకు, నువ్వు పంటలకు ఈ వర్షం అనుకూలమని రైతులు చెబుతున్నారు.

విత్తనశుద్ధి మేలు



చాటాయివలసలో డీఎస్ఆర్ యంత్ర సాయంతో వరి విత్తనాలు వేస్తున్న దృశ్యం

రేగిడి: ప్రధాన పంట సాగుకు ముందు విత్తనాలు శుద్ధి చేసుకుంటే మేలు అని ప్రకృతి వ్యవసాయం ఐసీఆర్‌పీ పైల తవిటినాయుడు, రెడ్డీస్ ఫౌండేషన్ ప్రతినిధి శరత్‌కుమార్ అన్నారు. మండలంలోని చాటాయివలస గ్రామంలో బీజామృతంతో విత్తనాలు శుద్ధి, దాని ప్రయోజనాలపై రైతులకు సోమవారం అవగాహన కల్పించారు. ప్రకృతి సేద్యంలో భాగంగా తయారు చేసుకునే బీజామృతంతో విత్తనాలు శుద్ధి చేసుకోవడం ద్వారా తెగుళ్లు, చీడపీడలను పంట తట్టుకుని, ఏపుగా పెరుగుతుందన్నారు. అనంతరం డీఎస్ఆర్ యంత్ర సాయంతో పొలాల్లో నేరుగా విత్తనాలు వేసే విధానాన్ని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కరణం గోవిందరావు, ఎంపీటీసీ సభ్యులు పొగిరి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా మ్యాంగో రైపెనింగ్ సెంటర్



రాజాం మార్కెట్ యార్డులో మ్యాంగో రైపెనింగ్ సెంటర్

రాజాం: వ్యవసాయ మార్కెట్ యార్డులో మామిడి రైతుల కోసం ఏర్పాటు చేసిన మ్యాంగో రైపెనింగ్ సెంటర్ నిరుపయోగంగా మారింది. చాలామంది రసాయనాలతో మామిడి కాయలను మగ్గపెట్టి, పండ్లను చేస్తారు. అలా చేసిన వాటిని తింటే అనారోగ్యం పాలవుతామన్న ఉద్దేశ్యంతో సహజ వాతావరణంలో మిషన్‌ల ద్వారా మామిడి కాయలను మగ్గపెట్టి, పండ్లను చేసేందుకు ఈ సెంటర్‌ను 2013లో ఏర్పాటు చేశారు. అయితే ఈ కేంద్రం పనితీరుపై రైతులకు అవగాహన కల్పించకపోవడంతో ప్రస్తుతం ఖాళీగా దర్శనమిస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలని పలువురు రైతులు కోరుతున్నారు.

సీహెచ్‌సీకి రోగుల తాకిడి



ఆస్పత్రి వరండాలో చికిత్స పొందుతున్నరోగులు

బాడంగి: సీహెచ్‌సీకి రోగుల తాకిడి రోజురోజుకూ ఎక్కువవుతోంది. సోమవారం ఒక్కరోజే 200 ఓపీలు వచ్చాయి. వీరిలో చాలామంది ఇన్ పేషెంట్లుగా చేరి, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రోగుల్లో జ్వరాలు, అతిసారంతో బాధపడుతున్న వారే ఎక్కువగా ఉన్నారు. ప్రస్తుతం ఆస్పత్రిలో చేరుతున్న వారికి సరిపడ గదులు లేకపోవడంతో వరండాలోనే బెడ్లు వేసి, రోగులకు వైద్యసేవలు అందిస్తున్నారు. ఆస్పత్రి పరిసరాలు కూడా అంత పరిశుభ్రంగా లేవని రోగుల బంధువులు చెబుతున్నారు.

అంగరంగ వైభవంగా శ్రీనివాస కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

విజయనగరం ఫూల్‌బాగ్: భారతీయ తత్వదర్శన కేంద్రం శ్రీ క్షేత్రంలో కొలువై ఉన్న అష్టలక్ష్మీ సమేత ఐశ్వర్య వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీనివాసుని కల్యాణంగా సోమవారం కనులపండువగా జరిగింది. ఆలయ అర్చకులు చామర్తి రమేష్ ఆచార్యులు, చామర్తి శ్రీనివాస రమేష్ ఆచార్యులు సంయుక్తంగా శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. ఉత్సవంలో ఆలయ ధర్మకర్తలు దుర్గాబాలాజీ,ఉమాదేవి దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

జిల్లా యువతకు ఉపాధి చూపండి

విజయనగరం ఫూల్‌బాగ్: విజయనగరం జిల్లాలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే చర్యలను కొత్త ప్రభుత్వం చేపట్టాలని లోక్ సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను కోరారు. జెడ్పీ అతిథిగృహంలో తన బృందంతో సోమవారం మంత్రిని కలిసారు. జిల్లాలోని ప్రధాన సమస్యలను తెలియజేశారు. అనంతరం విలేకరులతో బాబ్జి మాట్లాడుతూ జిల్లాలో చిన్న, సూక్ష్మ పరిశ్రమలు ఏర్పాటు అవకాశాలను మంత్రికి వివరించామన్నారు. కార్యక్రమంలో కుమరాం మాజీ సర్పంచ్ సబ్బవరపు సత్యనారాయణ, జానపద గాయకుడు జానకిరామ్, జామి మండల యువజన నాయకులు బాబ్జి, సుంకర రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ పనుల్లో రైతు బిజీబిజీ



వన్నలిలో వరి విత్తనాలు వేస్తున్న రైతు

రేగిడి: ఖరీఫ్ సాగు పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. ఉదయాన్నే పొలానికి వెళ్లి, దుక్కి చేసి విత్తనాలు చల్లుతున్నారు. కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాలతో అనుకూల వాతావరణం ఏర్పడడంతో మండలంలోని పలుచోట్ల రైతులు వరి విత్తనాలు వేస్తూ కనిపించారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

రాజాం: ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ సూచించారు. సోమవారం స్థానిక పట్టణంలోని పలు వార్డుల్లో పారిశుద్ధ్య పనుల పరిశీలన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో దోమల కారణంగా మలేరియా, డెంగీ వంటి జ్వరాలు ఎక్కువగా వస్తాయని, మురుగు నిల్వలు, చెత్తాచెదారం లేకుండా చూసుకోవాలని, అలా అయితే దోమలను నివారించవచ్చన్నారు. కొబ్బరిబొండాలు, వాడి వదిలేసిన టైర్లలో నీరు నిల్వ ఉండే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, వాటిని ఇంటి పరిసరాల్లో లేకుండా చూసుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటిస్తేనే సమాజం ఆరోగ్యంగా ఉంటుందన్న విషయం అందరూ గుర్తుంచుకోవాలన్నారు.

వైభవంగా సామూహిక సత్యనారాయణ వ్రతాలు



సత్యనారాయణ స్వామి వ్రతాలు జరిపించుకుంటున్న భక్తులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొత్తపేట సత్యనారాయణస్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు సోమవారం వైభవంగా జరిగాయి. ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయ పురోహితులు వేకువజాము నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వివిధ రకాల పంచామృతాలతో అభిషేకాలు జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి సన్నిధిలో వ్రతాలు జరిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజాభివృద్ధి



బంగారు పతకాలు అందుకున్న విద్యార్థులతో సెట్విజ్ సీఈఓ రామ్‌గోపాల్, మైక్రో ఇరిగేషన్ పీడీ లక్ష్మీనారాయణ

విజయనగరం టౌన్: విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని జిల్లా యువజన సర్వీసులశాఖ, సెట్విజ్ సీఈఓ బొడ్డేటి రామ్‌గోపాల్, జిల్లా మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పీఎన్‌వీ లక్ష్మీనారాయణ అన్నారు. సంతపేట గవరవీధిలో ఉన్న శ్రీ గౌరీసేవా సంఘం కార్యాలయ ఆవరణలో సోమవారం పదోతరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో అధిక మార్కులు సాధించిన వారిని బంగారు పతకాలతో సత్కరించారు. వారి ఉన్నత చదువుకు కావాల్సిన నోటుబుక్స్, పెన్నులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచి చక్కని ప్రణాళికతో విద్యను అభ్యసించాలన్నారు. సంఘ అధ్యక్షుడు కాండ్రేగుల శేఖర్ మాట్లాడుతూ సంఘ పరిధిలో ఉన్న విద్యార్థులకు నైతిక విలువలతో పాటు కెరీర్ గైడెన్స్, కంప్యూటర్ కోర్సులను నేర్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ జిల్లా ముఖ్యనాయకులు కాళ్ల నాగభూషణరావు, సంఘం అధ్యక్షురాలు కనిశెట్టి అమ్మాని, సుధాకర్, చిన్నారావు, నగేష్, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

పని ప్రదేశంలో ఫీల్డ్ అసిస్టెంట్లు ఉండాలి



లింగాలవలసలో వేతనదారులకు సూచనలిస్తున్న ఏపీవో హరనాథ్

రేగిడి: ఉపాధి హామీ పథకం పనులు జరిగే చోట ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్‌లు తప్పనిసరిగా ఉండాలని ఏపీవో ఎస్.హరనాథ్ సూచించారు. మండలంలోని అంబఖండి, సోమరాజుపేట, లింగాలవలస, తాటిపాడు గ్రామాల్లో జరుగుతున్న పనులను ఆయన సోమవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవి ఎండలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఉదయం, సాయంత్రం చల్లగా ఉన్న సమయాల్లో పనులు చేసుకోవాలని వేతనదారులకు సూచించారు. అలాగే నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తే గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందన్నారు. జాబ్‌కార్డు ఉన్న వారు మాత్రమే పనులకు రావాలని, పనిలోకి రానివారికి మస్తర్లు వేయొద్దని తెలిపారు. వర్షసూచన ఉంటే పని దగ్గర నుంచి వెంటనే ఇంటికి వెళ్లిపోవాలన్నారు.

నేత్ర వైద్యశిబిరం



నేత్ర పరీక్షలు చేస్తున్న పుష్పగిరి కంటి ఆస్పత్రి సిబ్బంది

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని వెదుళ్లవలస గ్రామంలో ఇండియన్ రెడ్‌క్రాస్, మానవీయతా సంస్థ ఆధ్వర్యం లో సోమవారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో విజయనగరం పుష్పగిరి కంటి ఆస్పత్రి సిబ్బంది వెదుళ్లవల స, ఆవగూడెం పరిసర గ్రామాలకు చెందిన 52 మంది నేత్ర పరీక్షలు చేసి 18 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. అవసరమై న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ఆర్థిక సహాయం

జామి: మండలంలోని విజినిగిరి గ్రామానికి చెందిన కొండమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆమె వైద్యఖర్చుల నిమిత్తం అదే గ్రామానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ సోమవారం రూ.15వేల ఆర్థిక సహాయం అందజేసింది. హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ సభ్యులు టి.సూర్య నారాయణరాజు, బి.నారాయణరావు పాల్గొన్నారు.